RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | సోమవారం, జూన్ 8, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 50 | పేజీలు: 8 | వెల : రూ.1



## తెలంగాణలో స్కూళ్లకు వేసవి సెలవులు పొడిగింపు

జూన్ 12కు బదులుగా 15న స్కూళ్ల పునఃప్రారంభం

రెండో శనివారం, ఆదివారం నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వర్తింపు

ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

# అభివృద్ధి విషయంలో అందరం ఒక్కటిగా పనిచేద్దాం

మల్కాజిగిరి ప్రజల ఆశీర్వాదంతోనే ఎంపీ నుంచి సీఎం స్థాయికి వచ్చా

హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు రాజకీయాలకు అతీతంగా సహకరించాలి

మూసీ ప్రక్షాళనను అడ్డుకోవడం ప్రజల ప్రయోజనాలను అడ్డుకోవడమే

మెట్రో విస్తరణ, ట్రిపుల్ ఆర్, మౌలిక వసతుల అభివృద్ధి తప్పనిసరి

కేంద్రం అనుమతులు ఇవ్వాలి.. కిషన్‌రెడ్డి సహకరిస్తే గౌరవిస్తాం

అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలంతా భాగస్వాములు కావాలని సీఎం పిలుపు

హైదరాబాద్: "మల్కాజిగిరి ఎంపీగా గెలిపించినప్పుడు వేరే ప్రభుత్వం ఉండటంతో మీరు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయాను. కానీ ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నాను. రాజకీయాలకు అతీతంగా ఎన్ని నిధులైనా, ఎన్ని అనుమతులైనా ఇచ్చే బాధ్యత నాది. రోడ్లు, తాగునీరు, చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ, మెట్రో విస్తరణ తదితర అభివృద్ధి కార్యక్రమాలు ఏవి కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఒకటే చెబుతున్నాను. ఎన్నికల సమయంలో రాజకీయాలు చేద్దాం. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనుల విషయంలో మాత్రం అందరం కలిసి పనిచేద్దాం. మీకు కావాల్సినవి అడిగి సాధించుకోండి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కొడంగల్‌లో ఓడిపోయి రాజకీయంగా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్న సమయంలో మల్కాజిగిరి ప్రజలు ఆశీర్వదించి ఎంపీగా

(మిగతా 2వ పేజీలో)





## హిట్లర్ ఆదర్శం కాబట్టే అరాచకాలు

రేవంత్ నిరంకుశ, ఫాసిస్ట్ మనస్తత్వం దేశానికి అర్థమైంది

హైడ్రా ఒక అస్సాసినేషన్ ఏజెన్సీ.. హంతక ముఠాలా వ్యవహరిస్తోంది

పేదల ఇళ్ల కూల్చివేతలను గొప్పగా చెప్పుకోవడం దారుణం

బీఆర్ఎస్ పాలన రాజ్యాంగ స్ఫూర్తి, గాంధీ మార్గంలో సాగింది: కేటీఆర్

హైదరాబాద్: ప్రపంచంలోనే అత్యంత క్రూరుడైన నియంత అడాల్ఫ్ హిట్లర్‌ను ఆదర్శంగా భావిస్తున్నందుకే రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అరాచక పాలన కొనసాగిస్తున్నారని

(మిగతా 2వ పేజీలో)



## హైదరాబాదులో చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం... రేపటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

నాంపల్లిలో రేపు రాత్రి నుంచి చేప ప్రసాదం పంపిణీ

తెలంగాణ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు

నగరంలో రెండు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమలు

మృగశిర కార్తె రాత్రి రావడంతో ఈసారి రాత్రి 9 గంటలకు ప్రారంభం

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి




## మందమర్రి వద్ద బోల్తాపడ్డ టీజీఎస్ఆర్టీసీ బస్సు.. తప్పిన పెను ప్రమాదం

డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పిన వాహనం

ప్రమాద సమయంలో బస్సులో ఒక్కరే ప్రయాణికుడు

ఈ ఘటనలో డ్రైవర్, ప్రయాణికుడికి స్వల్ప గాయాలు

ప్రయాణికులు ముందే దిగిపోవడంతో తప్పిన పెను ప్రమాదం



వాయిస్
ఆఫ్ ప్రజలు
సోమవారం, జూన్ 8, 2026

# అభివృద్ధి విషయంలో అందరం ఒక్కటిగా పనిచేద్దాం

గెలిపించారని, అక్కడి నుంచే తన రాజకీయ ప్రయాణం సీఎం స్థాయికి చేరుకుందని ఆయన గుర్తు చేసుకున్నారు. అందుకే మల్కాజిగిరి అభివృద్ధి తన ప్రత్యేక బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని కోరారు. శనివారం ఉప్పల్ భగాయత్ లేఔట్ ఫేజ్--3లో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవనం, టీకేఆర్ జంక్షన్ ఫ్లైఓవర్, ఏఓసీ సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రహదారులు, వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులకు సంబంధించిన శంకుస్థాపన శిలాఫలకాలను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాజకీయ స్వార్థం కోసం, ఎన్నికల లబ్ధి కోసం మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేశానని కొందరు విమర్శిస్తున్నారని, కానీ వాస్తవానికి పరిపాలన సౌలభ్యం కోసం, అన్ని ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. క్యూర్ పరిధిలోని 2,100 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో 1.34 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్నారని, వారి అవసరాలను సమర్థవంతంగా తీర్చేందుకు జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ కార్పొరేషన్లుగా విభజించామని వివరించారు. ఇదే తరహాలో పోలీసు వ్యవస్థను కూడా వికేంద్రీకరించినట్లు తెలిపారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని పది ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నామని, రూ.1,511 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని వెల్లడించారు. మూసీ ప్రక్షాళనపై వస్తున్న విమర్శలకు స్పందిస్తూ "గుజరాత్‌లో సబర్మతి రివర్‌ఫ్రంట్‌ను అభివృద్ధి చేయొచ్చు. ఢిల్లీలో యమునా రివర్‌ఫ్రంట్‌ను అభివృద్ధి చేయొచ్చు. ఉత్తరప్రదేశ్‌లో గంగా నదీ తీరాన్ని సుందరీకరించొచ్చు. కానీ తెలంగాణలో మనం మూసీని ప్రక్షాళన చేయకూడదా? అని అడ్డుకుంటున్న వారిని ప్రశ్నిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు సుమారు 55 కిలోమీటర్ల మేర మూసీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి అంతర్జాతీయ స్థాయి నదీతీరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. "న్యూయార్క్, న్యూజెర్సీ మధ్యనున్న రివర్‌ఫ్రంట్ ప్రాంతంలో ఒక్కో అపార్ట్‌మెంట్ విలువ వందల కోట్ల రూపాయలు ఉంటుంది. కానీ ఇక్కడ మూసీలో పేరుకుపోయిన మురికి, కాలుష్యం వల్ల ఈ ప్రాంత భూములకు విలువ లేకుండా పోయింది. ప్రజలు నివసించడానికి కూడా ఇష్టపడటం లేదు. నల్లగొండ జిల్లాలో ప్రజలు కాలుష్యంతో ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం కనీస కనికరం చూపకూడదా? ఆలేరు, భువనగిరి ప్రాంతాల్లో కొత్తగా పెళ్లైన దంపతులకు గర్భధారణ సమస్యలు వస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీరు, కలుషిత ఆహారం కారణంగా ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. ఫ్లోరైడ్, మూసీ కాలుష్యం, నదిలో కొట్టుకొచ్చే మృతదేహాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకే ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు" అని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్ భవిష్యత్ అభివృద్ధి గురించి మాట్లాడుతూ నగర రవాణా వ్యవస్థను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. నాగోల్ నుంచి నేరుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో కనెక్టివిటీ కల్పించేందుకు నాగోల్ జంక్షన్--ఎల్‌బీనగర్--ఒవైసీ ఆస్పత్రి--చాంద్రాయణగుట్ట--రాజేంద్రనగర్--ఎయిర్‌పోర్ట్ మార్గంలో మెట్రో విస్తరణ చేపట్టాల్సిందేనని చెప్పారు. అలాగే ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు కూడా మెట్రోను పొడిగించాలని సూచించారు. మొత్తం మెట్రో నెట్‌వర్క్‌ను 122 కిలోమీటర్ల మేర విస్తరించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా మార్చేందుకు తాను ప్రయత్నిస్తుంటే కొన్ని శక్తులు అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆరోపించారు.



అవసరమైన అనుమతులు వచ్చిన తర్వాత కూడా కొన్ని రాజకీయ కారణాలతో పనులు నిలిపివేయించారని విమర్శించారు. "ఓఆర్ఆర్ వచ్చిందని మాత్రమే హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా మారిపోదు. రీజినల్ రింగ్ రోడ్ పూర్తయితే 360 కిలోమీటర్ల పరిధిలో అభివృద్ధి విస్తరిస్తుంది. అప్పుడు హైదరాబాద్ సింగపూర్, టోక్యో, న్యూయార్క్‌లాంటి నగరాలతో పోటీ పడగలదు. అంతర్జాతీయ నగరమని చెప్పుకోవడం సరిపోదు. ఆ స్థాయిలో అభివృద్ధి జరగాలి" అని స్పష్టం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడిగా రాజకీయ జీవితం ప్రారంభించిన తనను ఈ స్థాయికి తీసుకొచ్చింది ప్రజలేనని పేర్కొంటూ, ముఖ్యంగా మహిళలు తన ఎదుగుదలలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. అందుకే ప్రతి సభలో మహిళలకు ముందు వరుసలో కూర్చునే అవకాశం కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం క్యూర్--1 యాప్‌ను ప్రారంభించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డి పేరు పెడుతున్నట్లు ప్రకటిస్తూ, చౌరస్తాలో ఆయన విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఉద్దేశించి కూడా సీఎం ఘాటు వ్యాఖ్యలు చేశారు. "హైదరాబాద్‌కు రెండో దశ మెట్రో రావాల్సిందే. ట్రిపుల్ ఆర్‌కు అనుమతులు రావాల్సిందే. మూసీ ప్రక్షాళన పూర్తవ్వాల్సిందే. రాష్ట్రంలో పండించిన పంటలను కేంద్రం కొనాల్సిందే. వీటన్నింటికీ మీరు సహకరించాలి. సహకరించకపోతే ప్రజలే సమాధానం చెబుతారు" అని హెచ్చరించారు. "మీ పార్టీ కార్యకర్తలే మీరు పార్టీ కోసం పని చేయలేదని చెబుతున్నారు. బీజేపీలో ఉంటూ బీఆర్ఎస్ చెప్పింది వింటారని అంటున్నారు. అలాంటప్పుడు పార్టీ మారాల్సిన అవసరం ఏముంది? ఉపన్యాసాలు ఆపండి కిషన్‌రెడ్డి గారూ" అని వ్యాఖ్యానించారు. రెండున్నరేళ్లలో దాదాపు 50 సార్లు ఢిల్లీకి వెళ్లానని, ఐదుసార్లు ప్రధాని మోదీని కలిశానని, అయినా రాష్ట్రానికి అవసరమైన అనుమతులు రాకపోవడానికి కారణం ఎవరో ఇప్పుడు ప్రజలకు అర్థమవుతోందన్నారు. "రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన అనుమతులు తీసుకురండి. లక్ష మంది ప్రజల సమక్షంలో ఎల్‌బీ స్టేడియంలో మీకు శాలువా కప్పి గండపెండేరం తొడుగుతాం. ప్రజలు అమాయకులు కాదు. అంబర్‌పేటలో ఇప్పటికే తమ తీర్పు ఏమిటో చూపించారు. ఇప్పటికైనా సహకరించండి. లేకపోతే ఈ నెల 15 తర్వాత మా కార్యాచరణ ఎలా ఉంటుందో చూస్తారు" అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.



## హైదరాబాదులో చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం... రేపటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

**నాంపల్లిలో రేపు రాత్రి నుంచి చేప ప్రసాదం పంపిణీ**

**తెలంగాణ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు**

**నగరంలో రెండు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమలు**

**మృగశిర కార్తె రాత్రి రావడంతో ఈసారి రాత్రి 9 గంటలకు ప్రారంభం**

**ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి**

హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏటా నిర్వహించే బత్తిని సోదరుల చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధమైంది. మృగశిర కార్తెను పురస్కరించుకుని ఆస్తమా రోగులకు అందించే ఈ ప్రసాదం పంపిణీ రేపు (జూన్ 8) రాత్రి 9 గంటలకు ప్రారంభం కానుంది. మృగశిర కార్తె రాత్రి ప్రవేశిస్తుండటంతో ఈ మార్పు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జూన్ 9వ తేదీ రాత్రి వరకు ఈ పంపిణీ నిరంతరాయంగా కొనసాగనుంది. ఈ కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి స్వయంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌ను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఫ్యాన్లు, కూలర్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు, సీపీఆర్ బృందాలను సిద్ధంగా ఉంచారు. భద్రత కోసం పోలీసులు, షీ టీమ్స్, సీసీటీవీలతో నిఘా ఏర్పాటు చేశారు. చేప ప్రసాదం పంపిణీ నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షలు జూన్ 8 ఉదయం 6 గంటల నుంచి జూన్ 9 రాత్రి 8 గంటల వరకు అమల్లో ఉంటాయి. ఆర్టీసీ బస్సులు, వ్యాన్లలో వచ్చేవారు గాంధీభవన్ లేదా గృహకల్ప వద్ద, ఆటోల్లో వచ్చేవారు షెజాన్ హోటల్ వద్ద దిగి గ్రౌండ్స్‌కు చేరుకోవాలి. ఈ నేపథ్యంలో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని పోలీసులు సూచించారు.

# హిట్లర్ ఆదర్శం కాబట్టే అరాచకాలు



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. బెంగళూరులో జరిగిన 'ది హిందూ' కాన్‌క్లేవ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతల కోసం ఏర్పాటు చేసిన హైడ్రా సంస్థకు జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్ చర్యలే స్ఫూర్తి అని ముఖ్యమంత్రి స్వయంగా బహిరంగ వేదికపై ప్రకటించడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. సీఎం వ్యాఖ్యలపై ఆదివారం ఎక్స్ వేదికగా స్పందించిన కేటీఆర్.. రేవంత్‌రెడ్డి నిరంకుశ, ఫాసిస్ట్ మనస్తత్వం ఇప్పుడు దేశం మొత్తానికి స్పష్టంగా అర్థమైందని ఎద్దేవా చేశారు. "మీకు స్ఫూర్తి హిట్లర్ అనేది ముమ్మాటికీ నిజమే. రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన హైడ్రా ఒక అస్సాసినేషన్ ఏజెన్సీ, హంతక ముఠా లాంటిది. మీరు నియంతలను పూజిస్తారు. పేదల ఇళ్ల కూల్చివేతలను గొప్పగా చెప్పుకుంటూ మురిసిపోతారు. తెలంగాణ ప్రజలకు మీ నియంతృత్వ నైజం ముందే తెలుసు. ఇప్పుడు మీ నోటితోనే మీ ఫాసిస్ట్ ఆలోచనలను దేశం మొత్తానికి స్పష్టం చేసినందుకు ధన్యవాదాలు" అని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ వ్యవహరిస్తున్న ప్రభుత్వం అసలు స్వరూపాన్ని ముఖ్యమంత్రి వ్యాఖ్యలే బయటపెట్టాయని ఆయన ఆరోపించారు. హిట్లర్‌ను ఆదర్శంగా భావించే ఆలోచనలతో ప్రజాస్వామ్య పరిపాలన సాగదని, అలాంటి భావజాలం ప్రమాదకరమని పేర్కొన్నారు. హైడ్రా పేరుతో జరుగుతున్న చర్యలు ప్రజలలో భయాందోళనలు సృష్టిస్తున్నాయని, ముఖ్యంగా పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. "రేవంత్‌రెడ్డి.. మీలాంటి హిట్లర్ ఆలోచనలు చేసేంత మేధావులం మేము కాదు. అందుకే మా పదేళ్ల పరిపాలనను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగ స్ఫూర్తితో, మహాత్మాగాంధీ చూపిన అహింసా మార్గంలో, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ కన్న కలల ఆశయాల ప్రాతిపదికన నడిపించాం" అని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల హక్కులు, సంక్షేమం, అభివృద్ధిని కేంద్రబిందువుగా చేసుకొని పనిచేసిందని, రాజ్యాంగబద్ధ పరిపాలనను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం ఆధారంగానే రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లామని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం మాత్రం భిన్నమైన ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు కేవలం రాజకీయ వివాదమే కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థపై ఉన్న ఆయన దృక్పథాన్ని కూడా ప్రతిబింబిస్తున్నాయని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. హిట్లర్ వంటి నియంతను స్ఫూర్తిగా పేర్కొనడం ద్వారా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయని అన్నారు. ప్రజల ఆస్తులు, ఇళ్లు, జీవనోపాధిపై ప్రభావం చూపే చర్యలను అమలు చేస్తూనే వాటిని సమర్థించేందుకు హిట్లర్ పేరును ప్రస్తావించడం మరింత ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రజాస్వామ్య విలువలను విశ్వసిస్తారని, నియంతృత్వ ధోరణులను ఎప్పటికీ అంగీకరించరని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజల తీర్పే అంతిమమని, తెలంగాణ సమాజం ఎప్పుడూ రాజ్యాంగ స్ఫూర్తి, ప్రజాస్వామ్య విలువల పక్షానే నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

## మరో రెండుమూడు రోజుల్లో తెలంగాణలోకి 'నైరుతి'

### 10-12 మధ్య రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాల ప్రవేశం

### అరేబియా, బంగాళాఖాతాల్లో రెండు తుపాను ఆవర్తనాల ప్రభావం

### 4న ఆలస్యంగా కేరళను తాకిన రుతుపవనాలు

### ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం?



తీవ్రమైన ఎండలు, పొడి వాతావరణంతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు, రైతులకు వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. మరికొన్ని రోజుల్లోనే రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించనున్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తాజాగా అంచనా వేశారు. ఈ నెల 10 నుంచి 12 మధ్య ఇవి తెలంగాణను తాకే అవకాశం ఉంది. ఈశాన్య అరేబియా సముద్రం, ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన రెండు తుపాను ఆవర్తనాలు ఈ రుతుపవనాల కదలికకు సానుకూలంగా మారాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు జూన్ 4న కేరళ తీరాన్ని తాకాయి. సాధారణంగా జూన్ 1 నాటికే రావాల్సిన రుతుపవనాలు ఈసారి మూడు రోజులు ఆలస్యంగా ప్రవేశించాయి. ప్రస్తుతం ఇవి తీరప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల గుండా వేగంగా ముందుకు సాగుతున్నాయి. దక్కన్ పీఠభూమిలో ఉన్న తెలంగాణ ప్రస్తుతం ఈ రుతుపవనాల రాక కోసం సిద్ధంగా ఉంది. రుతుపవనాల ద్రోణి వెంబడి ఏర్పడిన ఈ రెండు తుపాను ఆవర్తనాల వల్ల అరేబియా సముద్రం నుంచి తేమతో కూడిన గాలులు ఈశాన్య దిశగా కదులుతున్నాయి. అదే సమయంలో బంగాళాఖాతంలో ఉన్న ఆవర్తనం చుట్టుపక్కల గాలిని తన వైపునకు లాక్కుంటోంది. ఈ రెండింటి కలయిక వల్ల మధ్య భారతదేశంపై మేఘాలు దట్టంగా కమ్ముకుని వర్షాలు కురిసే అవకాశం ఉంది. 11వ తేదీ నాటికి ఈ వ్యవస్థ మరింత బలపడి, తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (×వీణ) వెల్లడించింది. ఇప్పటికే రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఈ రుతుపవనాల రాక ఖరీఫ్ పంటలకు సిద్ధమవుతున్న రైతులకు ఎంతో ఊరటనివ్వనుంది. అయితే, ఈ ఏడాది 'ఎల్ నినో' ప్రభావం కారణంగా దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ (సుమారు 90 శాతం) వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో నీటి నిర్వహణపై రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

## తెలంగాణలో స్కూళ్లకు వేసవి సెలవులు పొడిగింపు

**జూన్ 12కు బదులుగా 15న స్కూళ్ల పునఃప్రారంభం**

**రెండో శనివారం, ఆదివారం నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం**

**రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వర్తింపు**

**ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం**

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యార్థులకు, తల్లిదండ్రులకు కీలకమైన అప్‌డేట్ ఇచ్చింది. పాఠశాలలకు ప్రకటించిన వేసవి సెలవులను పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ముందుగా జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం జూన్ 12న పాఠశాలలు తెరుచుకోవాల్సి ఉండగా, తాజాగా ఆ తేదీని జూన్ 15కు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే.. జూన్ 13 రెండో శనివారం, జూన్ 14 ఆదివారం కావడంతో కేవలం ఒక్క రోజు (జూన్ 12, శుక్రవారం) కోసం పాఠశాలలు తెరిచి, మళ్లీ రెండు రోజులు సెలవులు ఇవ్వడంపై గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో పునఃప్రారంభ తేదీని పునఃపరిశీలించాలని ప్రభుత్వం వద్దకు పలు అభ్యర్థనలు వచ్చాయి. ఈ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, విద్యార్థుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సెలవులను పొడిగించడమే సరైనదని భావించింది. దీనితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు జూన్ 15వ తేదీ సోమవారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయని విద్యాశాఖ స్పష్టం చేసింది.




## మందమర్రి వద్ద బోల్తాపడ్డ టీజీఎస్ఆర్టీసీ బస్సు.. తప్పిన పెను ప్రమాదం

**డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పిన వాహనం**

**ప్రమాద సమయంలో బస్సులో ఒక్కరే ప్రయాణికుడు**

**ఈ ఘటనలో డ్రైవర్, ప్రయాణికుడికి స్వల్ప గాయాలు**

**ప్రయాణికులు ముందే దిగిపోవడంతో తప్పిన పెను ప్రమాదం**

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణ సమీపంలో ఆదివారం ఉదయం టీజీఎస్ఆర్టీసీ (TGSRTC) బస్సు ప్రమాదానికి గురైంది. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు ఒక ప్రయాణికుడికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణికులు తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. కొత్తగూడెం నుంచి బెల్లంపల్లికి వెళ్తున్న సూపర్ లగ్జరీ బస్సు మందమర్రి సమీపానికి రాగానే, డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో బస్సు అదుపుతప్పి జాతీయ రహదారి నుంచి పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డుపైకి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో డ్రైవర్‌తో పాటు కేవలం ఒకే ఒక్క ప్రయాణికుడు ఉన్నట్లు సమాచారం. మిగతా ప్రయాణికులందరూ అప్పటికే తమ గమ్యస్థానాల్లో దిగిపోవడంతో భారీ ప్రాణనష్టం తప్పింది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన డ్రైవర్, ప్రయాణికుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అనంతరం ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బస్సును అక్కడి నుంచి తొలగించారు. డ్రైవర్ అలసటే ఈ ప్రమాదానికి ప్రాథమిక కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

## రేవంత్ రెడ్డికి కూడా అదే గతి పడుతుంది: కిషన్ రెడ్డి

**సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫైర్**

**రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ బాటలోనే పయనిస్తున్నారని విమర్శలు**

**కేసీఆర్‌ను ప్రజలు ఫామ్‌హౌస్‌కే పరిమితం చేశారని వ్యాఖ్య**

**విదేశీ వ్యామోహంతో ప్రజల సమస్యలు మరచిన రేవంత్‌కు అదే గతి తప్పదన్న కిషన్ రెడ్డి**

**తెలంగాణలో పాలన మారినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని విమర్శ**



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పట్టిన గతే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డికి కూడా పడుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ అబద్ధపు హామీలు, అసమర్థ పాలనతో ప్రజాగ్రహానికి గురై ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో నడుస్తూ ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అధికారం మారినా ప్రజల ఆకాంక్షలు మాత్రం నెరవేరడం లేదని విమర్శించారు. అడ్డగోలు హామీలు, నమ్మకద్రోహంతో క్షేత్రస్థాయి సమస్యలను గాలికొదిలేశారని మండిపడ్డారు. సొంత దేశంలో జరుగుతున్న అభివృద్ధిపై విమర్శలు చేస్తూ, విదేశాలపై వ్యామోహం చూపించడం ఇద్దరు ముఖ్యమంత్రుల్లోనూ చూశామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా విదేశీ భాషలో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డికి కూడా కేసీఆర్ కు పట్టిన గతే పడుతుందని కిషన్ రెడ్డి హెచ్చరించారు. చేతగాని పాలన అందిస్తున్న నేతల గ్రాఫ్ పాతాళానికి పడిపోవడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు.



# ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి వైద్య శిబిరాలు దోహదం

## కోహినూర్‌లో ఉచిత వైద్య శిబిరం, మెడికల్ స్క్రీనింగ్‌కు విశేష స్పందన

హైదరాబాద్, జూన్ 07: సమాజ ఆరోగ్య పరిరక్షణకు వైద్య అవగాహన, ముందస్తు ఆరోగ్య పరీక్షలు అత్యంత అవసరమని దుంద్ర కుమారస్వామి పేర్కొన్నారు. సిమ్స్ హాస్పిటల్, బ్లిస్‌బర్గ్ ఫ్యూచర్ ఆఫ్ హోప్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఆరో రియాల్టీ కోహినూర్‌లో 12 వైద్య విభాగాలకు చెందిన నిపుణులచే ఉచిత వైద్య శిబిరం, మెడికల్ స్క్రీనింగ్, రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఆరో కోహినూర్ ఫ్లాట్ ఓనర్స్ మెయింటెనెన్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సహకారంతో క్లబ్‌హౌస్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కోహినూర్ కమ్యూనిటీ నుంచి విశేష స్పందన లభించింది. సుమారు వెయ్యికి పైగా కుటుంబాలకు చెందిన సభ్యులు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్య నిపుణుల సూచనలు పొందారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి, మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, ప్రముఖ సామాజికవేత్త, జాతీయ నాయకుడు దుంద్ర కుమారస్వామి, కోహినూర్ ఫ్లాట్ ఓనర్స్ సొసైటీ డైరెక్టర్లు నరసింహ, మస్తాన్ రెడ్డి, కిషోర్, కరుమూరి, మిశ్రా, అరుణ్ రెడ్డి, వర్మ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా మాట్లాడుతూ, "ఇలాంటి కార్యక్రమాలు కేవలం వైద్య శిబిరాలు మాత్రమే కావు. ఆరోగ్యవంతమైన సమాజ



నిర్మాణానికి వేసే బలమైన అడుగులు. ఒక సమాజ అభివృద్ధికి ఆరోగ్యం పునాది. అందుకే మన పెద్దలు 'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్నారు. మనం ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంపద, హోదా, విజయాలు, కుటుంబ సంతోషం విలువైనవిగా ఉంటాయి" అని పేర్కొన్నారు. దుంద్ర కుమారస్వామి మాట్లాడుతూ, వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే ముందుగానే గుర్తించి నివారించడమే ఉత్తమ వైద్యమని అన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, మెడికల్ స్క్రీనింగ్ నిర్వహించుకోవడం, వ్యాయామం, యోగా, ధ్యానం వంటి అలవాట్లను పెంపొందించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని సూచించారు. నేటి డిజిటల్ యుగంలో అధిక ఒత్తిడి, ఫాస్ట్‌ఫుడ్ అలవాట్లు, శారీరక శ్రమ తగ్గిపోవడం వంటి కారణాలతో మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కోట్లాది మంది ప్రజలు జీవనశైలి సంబంధిత వ్యాధులతో బాధపడుతుండగా, వారిలో చాలామందికి తమకు వ్యాధి ఉన్న విషయమే తెలియకపోవడం మరింత ఆందోళనకరమని పేర్కొన్నారు.

బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభ్యులు మాట్లాడుతూ, ఒక వ్యక్తి అనారోగ్యానికి గురైతే మొత్తం కుటుంబం ఆర్థికంగా, మానసికంగా ప్రభావితమవుతుందని తెలిపారు. కుటుంబాన్ని నడిపించే తల్లి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, వృద్ధులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, యువత ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

ఆరోగ్యం వ్యక్తిగత అంశం మాత్రమే కాదని, అది కుటుంబం, కమ్యూనిటీ, సమాజం కలిసి మోసే బాధ్యత అని పేర్కొన్నారు. ఆరోగ్యంపై ఖర్చు చేయడం వ్యయం కాదని, అది భవిష్యత్తుపై పెట్టుబడి అని అన్నారు. ఆరోగ్యవంతమైన కుటుంబాలే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాదిగా నిలుస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోహినూర్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభ్యులతో పాటు కమ్యూనిటీ ప్రతినిధులు, నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా టీఆర్ఎస్ జెండాపండుగ

## జెండా ఆవిష్కరించిన కల్వకుంట్ల కవిత





సంగారెడ్డి జిల్లా (ప్రతినిధి వాయిస్ టుడే) : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన (TRS) పార్టీ ఆధ్వర్యంలో 'జెండా పండుగ' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ కలబ్ గూర్ దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ మహా జనసమీకరణ సభకు ముఖ్య అతిథిగా లికల్వకుంట్ల కవితలి హాజరై, పార్టీ జెండాను ఆవిష్కరించారు.

### చరిత్ర ఉన్న జిల్లా సంగారెడ్డి.. యువత తెలుసుకోవాలి

సభను ఉద్దేశించి కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లాకు ఘనమైన చరిత్ర ఉందన్నారు. 1969 తెలంగాణ ఉద్యమం ఈ గడ్డ పైనే రగిలి ఊపందుకుందని, ఆనాటి ఉద్యమ చరిత్రను నేటి యువత తప్పక తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో అస్సలు తెలంగాణ ఎక్కడ ఉంది? అని ప్రశ్నించిన వారికి తెల్లాపూర్ ఒక సజీవ సాక్ష్యంగా, ఆనవాలుగా నిలిచింది. తెలంగాణ రక్షణ సేన (TRS) ద్వారా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తాం. అభివృద్ధిని మరింత బలోపేతం చేస్తాం." **– కల్వకుంట్ల కవిత**

### విద్యా, వైద్య రంగాలు పూర్తిగా విఫలం

రాష్ట్రంలో ఎన్నో పార్టీలు ఉన్నప్పటికీ, పేద, మధ్యతరగతి ప్రజల శ్రేయస్సు కోసమే తాము కొత్త పార్టీని స్థాపించాల్సి వచ్చిందని కవిత స్పష్టం చేశారు. గత 30 సంవత్సరాలుగా రాష్ట్రాన్ని ఏలుతున్న మూడు ప్రధాన పార్టీలు ప్రజలకు కనీస విద్యను అందించడంలో పూర్తిగా విఫలమయ్యాయని మండిపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రుల దుస్థితిపై ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ప్రమాదవశాత్తు ఎవరైనా ఆసుపత్రికి వెళ్తే.. ప్రభుత్వ దవాఖానాల్లో సూది ఉంటే దూది ఉండదు, దూది ఉంటే సూది ఉండని పరిస్థితి నెలకొంది. పిల్లలకు ఏం కావాలో తల్లులకే బాగా తెలుసు. అందుకే ఒక మహిళగా, రాష్ట్ర పిల్లల భవిష్యత్తు కోసం నేను ఈ ౹=ూ పార్టీని స్థాపించాను" అని ఆమె పేర్కొన్నారు.

### తెల్లాపూర్ శాసనం సాక్షిగా హామీ..

రాబోయే ఎన్నికల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే లిఉచిత విద్య, ఉచిత వైద్యంలి అందించడాన్ని ప్రజల హక్కుగా మారుస్తామని కవిత హామీ ఇచ్చారు. "ఒకవేళ మా ప్రభుత్వం వచ్చాక నేను ఇచ్చిన మాట తప్పితే.. నన్ను తెల్లాపూర్ శాసనం దగ్గరే కట్టేసి రాళ్ళతో కొట్టండి" అంటూ ఆమె భావోద్వేగ సవాల్ విసిరారు. 'పాంచజన్యం' సిద్ధాంతమే తమ ౹=ూ పార్టీ సిద్ధాంతమని ఈ సందర్భంగా ప్రకటించారు.

### స్థానిక నాయకత్వంపై నిప్పులు..

సంగారెడ్డి ప్రాంతంలో ఉన్న ల్యాండ్ మార్క్ ప్రాజెక్ట్ 'సింగూర్'ను పాలకులు పూర్తిగా పట్టించుకోకపోవడం వల్లే ప్రస్తుతం అది కుంగిపోయి ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక నాయకులపై విమర్శలు గుప్పిస్తూ.. "ఇక్కడ జగ్గారెడ్డి, దామోదర్, రఘునందన్ రావు లాంటి ఎందరో నాయకులు ఉన్నా ఎవరు ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. జహీరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్ విషయమై రఘునందన్ రావు నోరు మెదపడం లేదు" అని విమర్శించారు. అలాగే, ఆందోల్‌లో ఒక మంత్రి బావమరిది 200 ఎకరాల భూమిని కబ్జా చేసినా అడిగే నాథుడే లేడని, పటాన్‌చెరు మీూ అసలు ఏ పార్టీలో ఉన్నారో కూడా ప్రజలకు తెలియడం లేదని ఎద్దేవా చేశారు. మన ప్రాంతాన్ని ప్రేమించే ప్రాంతీయ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యమని, ౹=ూ పార్టీని ప్రజలు తమ 'ఇంటి పార్టీ'గా ఆదరించాలని కోరారు.

### భారీగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు

ఈ జెండా పండుగ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ బాలయ్య, నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీనివాస్ రెడ్డి, ముఖ్య నాయకులు కరుణాకర్, నితిన్, శ్రీకాంత్, ఖణ= యువసేన అధ్యక్షులు గోపాల్ రెడ్డితో పాటు భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, మహిళలు, యువతీ యువకులు పాల్గొన్నారు. కార్యకర్తల కోలాహలం, జెండాల పండుగతో సంగారెడ్డి కేంద్రం బంతివనంగా మారింది.

## డా. పెరుక రాజుకు "కాళోజి సాహిత్య పురస్కారం - 2026



కాళోజి సాహిత్య ప్రముఖ జాతీయ కవి, బహుభాషావేత్త, రచయిత, గేయకవి, అనువాదకుడు డా. పెరుక రాజు సాహిత్య రంగంలో అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మకమైన "కాళోజి సాహిత్య పురస్కారం -- 2026 ఎంపికయ్యారు. సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించే శక్తివంతమైన రచనల ద్వారా తెలుగు సాహిత్యానికి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.

తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో డా. పెరుక రాజు ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. కూలీ, రైతు కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగిన డా. పెరుక రాజు ప్రస్తుతం దేశ రక్షణ శాఖ ఆర్మీ విభాగంలో జూనియర్ అధికారి హోదాలో సేవలందిస్తున్నారు. జాతీయ కవిగా, గేయకవిగా, రచయితగా, అనువాదకుడిగా అనేక భారతీయ భాషల మధ్య భావాలను, సంస్కృతులను అనుసంధానిస్తూ విశేష కీర్తిని సంపాదించారు. సాహిత్యంతో పాటు సామాజిక సేవలోనూ ఆయన విశేష కృషి చేస్తున్నారు. పేద అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం "మై గిఫ్ట్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి సేవలందిస్తూ ప్రోత్సహించడమే మై గిఫ్ట్ అనే సిద్ధాంతంతో ముందుకు సాగుతున్నారు. ఈ ఏడాదిలోనే డా. పెరుక రాజు పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకోవడంతో పాటు అనేక గౌరవాలను సొంతం చేసుకున్నారు.



## విశ్వబ్రాహ్మణ జాతి రత్నాలను గుర్తించాలి

### ప్రధాని నరేంద్ర మోడీ విశ్వబ్రాహ్మణులకు పదవులు ఇవ్వాలి

### బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి

### ఘనంగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి జన్మదిన వేడుకలు

నాచారం (వాయిస్ టుడే): విశ్వబ్రాహ్మణ జాతిలో పుట్టి బీసీలకు ఎంతో సేవ చేస్తున్న జాతి రత్నాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి ఉన్నతమైన పదవులు ఇవ్వాలని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి డిమాండ్ చేశారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి జన్మదిన సందర్భంగా శనివారం ఆయనను కలిసిన గణేష్ చారి బర్త్డే విషెస్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ బీసీ కమిషన్ సభ్యులుగా ఉంటూ బీసీలకు విశ్వబ్రాహ్మణులకు ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఇలాంటి సేవ చేస్తున్న వారిని ప్రధాని నరేంద్ర మోడీ గుర్తించి ఉన్నతమైన పదవులను కట్టబెట్టాలని కోరారు. అప్పుడే బీసీ సమాజానికి న్యాయం జరుగుతుందని తెలిపారు. తల్లోజు ఆచారి జాతిరత్నమని బీసీలకు విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆనంతోజు బ్రహ్మచారి, ముత్తోజు ఆమని, ముత్తోజు అభిషేక్, చెన్నోజు సంతోష్ చారి, ఉమ్మడి సురేంద్ర, వల్లబోజు నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణలో క్లినికల్ సైకాలజీ వృత్తి బలోపేతానికి కార్యాచరణ

### హైదరాబాద్‌లో టీఏసీపీ సర్వ సభ్య సమావేశం

నాచారం (వాయిస్ టుడే): తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ క్లినికల్ సైకాలజిస్ట్స్ సర్వసభ్య సమావేశం ఆదివారం హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో నిర్వహించా రు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న కార్యవర్గ సభ్యులు, కార్యనిర్వా హక కమిటీ సభ్యులు, క్లినికల్ సైకాలజిస్టులు ఈ సమావేశానికి హాజరయ్యారు.తెలంగాణలో క్లినిక ల్ సైకాలజీ వృత్తిని మరింత బలోపేతం చేయడం, మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వృత్తిపరమైన సహకారాన్ని విస్తరించడం,సభ్యుల చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్స హించడం వంటి అంశాలపై సమా వేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పడిన కార్యనిర్వాహక కమిటీని సభ్యుల కు లాంఛనంగా పరిచయం చేశా రు. సంఘం నిర్మాణం,బాధ్యతలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళి కలు, సభ్యుల పాత్రలపై సమగ్ర అవగాహన కల్పించారు. అడ్వొకసీ అండ్ పబ్లిక్ అవేర్‌నెస్, ఎథిక్స్ అండ్ లీగల్ అడ్వైజరీ, ట్రైనింగ్ అండ్ ఎడ్యుకేషనల్, సోషల్ మీడియా, గవర్నమెంట్ లైజన్ టాస్క్ ఫోర్స్ కమిటీల లక్ష్యాలు, విధులు, భవిష్యత్ కార్యక్రమాలపై సవివరంగా చర్చలు జరిగాయి. రాష్ట్రంలోని క్లినికల్ సైకాలజిస్టుల వృత్తి పర మైన అభివృద్ధి, ప్రజల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపు, విధానపరమైన అంశాలపై ప్రభుత్వ స్థాయిలో చర్చలు జరిపే వ్యూహాలపై సభ్యులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. మానసిక ఆరోగ్య సేవల అభివృ ద్ధికి, క్లినికల్ సైకాలజిస్టుల వృత్తి పరమైన ప్రయోజనాల పరిరక్షణకు టీఏసీపీ కట్టుబడి ఉందని నాయ కులు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల మానసిక శ్రేయస్సు కోసం మరిన్ని అవగాహన కార్యక్రమాలు, శిక్షణా కార్యక్రమాలు చేపట్టను న్నట్లు వెల్లడించారు.ఈ సమావే శంలో టీఏసీపీ సలహా కమిటీ సభ్యురాలు డా. సరోజ్ ఆర్య, అధ్యక్షురాలు డా. వృషాలి రెడ్డి, ఉపాధ్యక్షుడు డా. సోమశేఖర్, కార్యదర్శి శిల్పా పన్నాల, సంయుక్త కార్యదర్శి గీతా మాగేష్, కోశాధికారి అంజన్‌కుమార్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొ న్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
సోమవారం 8 జూన్ 2026

# రోస్టర్ విధానాన్ని సవరించండి

## ఉద్యోగ నియామకాల్లో బీసీలకు అన్యాయం

## బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



హైదరాబాద్, జూన్ 07: ఉద్యోగ నియామకాల్లో బీసీలకు అన్యాయం చేసేలా లోపభూయిష్టంగా ఉన్న రోస్టర్ విధానాన్ని సరి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రోస్టర్ విధానం ద్వారా ఉద్యోగ నియామకాల్లో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ ఆదివారం ఆయన సీఎం రేవంత్ రెడ్డికి లేఖ వ్రాశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఉద్యోగ నియామకాల కోసం ప్రవేశ పెట్టిన కొత్త రోస్టర్ విధానం అశాస్త్రీయంగా ఉందని ఆయన లేఖలో పేర్కొన్నారు. బీసీలకు అన్యాయం జరిగేలా రోస్టర్ రూపొందించారనీ, డైరెక్ట్ రిక్రూట్మెంట్ పోస్టులు భర్తీ చేసేటప్పుడు మొదటి 10 పోస్టులలో బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. రిజర్వేషన్ల విధానంలో బీసీలకు 29శాతం, ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 6శాతం, మహిళలకు 33 శాతం సమాంతర రిజర్వేషన్లు కేటాయించారనీ, గ్రూప్ 2 పోస్టులతో డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోటా జోనల్ విధానంలో, జిల్లా కేటగిరీలో కేటాయించి నిర్ణయించినప్పుడు తక్కువ పోస్టులు ఉంటాయనీ, అలాంటప్పుడు ప్రస్తుతం రోస్టర్ విధానంలో తక్కువ పోస్టులు వస్తాయని చెప్పారు. రోస్టర్ విధానంలో తక్కువ పోస్టులు ఉన్నప్పుడు బడుగులకు అన్యాయం జరుగుతుందన్నారు. అందువల్ల రోస్టర్ విధానాన్ని శాస్త్రీయంగా మార్పులు చేయాలని, ఇందుకోసం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించాలని ఆయన కోరారు. రోస్టర్ సవరణ తరువాతనే కొత్త నియామకాలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




# ఆటో కార్మికుల హామీల అమలులో ప్రభుత్వం విఫలం

## కేసీఆర్ పాలనలో ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత

## హామీల అమలుపై రాహుల్ గాంధీ స్పందించాలి

## ప్రతి డివిజన్‌లో వచ్చే పది రోజుల పాటు కార్యకర్తల సమావేశాలు

## ప్రభుత్వ మాజీ ఛీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, (వాయిస్ టుడే) : 2023 ఎన్నికల సందర్భంగా ఆటో కార్మికులకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,మాజీ ఎమ్మెల్యే,హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచీకరణ ప్రభావంతో సంఘటిత,అసంఘటిత కార్మికుల జీవన పరిస్థితులు మరింత క్లిష్టంగా మారాయని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి రూ.77 కోట్ల పన్నులను మాఫీ చేయడంతో పాటు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించారని గుర్తు చేశారు. అలాగే ఆటో అడ్డాల ఏర్పాటు చేసి ట్రాఫిక్ పోలీసుల వేధింపులు లేకుండా చర్యలు చేపట్టారని తెలిపారు. సంవత్సరానికి రూ.12 వేల రూపాయల ఆర్థిక సాయం ఆటో కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. తెలంగాణలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు.

శ్రీ చైతన్య ఆటో కార్మిక పరస్పర సహకార సంఘం వార్షికోత్సవం సందర్భంగా సంఘానికి తన వ్యక్తిగత సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం సహకార సంఘాలు, కార్మిక సంఘాల అభివృద్ధికి ప్రత్యేక విధానాలను రూపొందిస్తామని చెప్పారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో వచ్చే పది రోజుల పాటు కార్యకర్తల సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్,నాయకులు పులి రజినీకాంత్,ఇమ్మడి రాజు,ఆటో కార్మిక సంఘం నాయకులు ఉప్పుల రాజేందర్,రామ్ చందర్, రవీందర్, సురేష్, గణేష్, రవి,సుదర్శన్,సమీర్,శరత్,నాగరాజు,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం

## కాజీపేట నూతన అడిషనల్ తహసీల్దార్ గాదం రమేష్

## మడికొండలో అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల



కాజీపేట, (వాయిస్ టుడే) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావి అని..ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శ ప్రాయమని కాజీపేట అడిషనల్ తహసీల్దార్ గాదం రమేష్ పేర్కొన్నారు. మడికొండలో ఆదివారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ సంఘం నాయకుడు కిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ తహసీల్దార్ గాదం రమేష్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గాదం రమేష్ మాట్లా డుతూ గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన నాయకులు,ప్రజలు ఐక్యంగా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కుల,మతాలకు అతీతంగా తన విధి నిర్వహణలో అందరికీ సమానంగా సహకరిస్తానని తెలిపారు. ప్రతి ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల కార్యక్రమాన్ని నిర్వ హిస్తూ విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం తెలంగాణ రైల్వే జేఏసీ చైర్మన్ కొండ్ర నరసింహరావు,కో-కన్వీనర్ వస్కుల రవీందర్‌లు గాదం రమేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు దయాకర్,కార్యదర్శి రవికుమార్,సంఘంనాయకులు రాము,వీఆర్వో ప్రసాద్,అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ వైభవాన్ని అధ్యయనం చేసిన ట్రైనీ ఐఏఎస్‌లు

## జిల్లాలోని పలు చారిత్రక,పర్యాటక, సామాజిక అభివృద్ధి కేంద్రాల సందర్శన

## కలెక్టర్లను, సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన ట్రైనీ కలెక్టర్లు



హనుమకొండ జిల్లా, (వాయిస్ టుడే) : తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "తెలంగాణ దర్శన్" అధ్యయన పర్యటనలో భాగంగా 2025 బ్యాచ్‌కు చెందిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు రెండు రోజుల పాటు కాకతీయుల చారిత్రక రాజధాని వరంగల్ నగరంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వారు జిల్లాలోని పలు చారిత్రక, పర్యాటక, సామాజిక అభివృద్ధి కేంద్రాలను సందర్శించి స్థానిక పరిపాలన,ప్రజా పాలన,అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరుపై అవగాహన పొందారు. పర్యటన సందర్భంగా అధికారులు ప్రపంచ వారసత్వ కట్టడం రామప్ప దేవాలయం, వరంగల్ కోట,వెయ్యి స్తంభాల దేవాలయం, భద్రకాళి దేవాలయం తదితర కాకతీయుల వైభవాన్ని ప్రతిబింబించే చారిత్రక ప్రదేశాలను సందర్శించారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఆదర్శ సహకార సంస్థగా గుర్తింపు పొందిన ముల్కనూర్ సహకార సంఘాన్ని సందర్శించి,గ్రామీణాభివృద్ధి, సహకార వ్యవస్థల నిర్వహణపై అధ్యయనం చేశారు.

ఈ సందర్భంగా ట్రైనీ అధికారులు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్,వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మరియు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ లను కలిసి జిల్లా పరిపాలన,ప్రజా సంక్షేమ కార్యక్రమాలు,అభివృద్ధి ప్రణాళికలు,శాంతిభద్రతల నిర్వహణ తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ పర్యటనకు లైజన్ అధికారిగా వ్యవహరించిన డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్, కాకతీయుల చరిత్ర, వారి పరిపాలనా దక్షత,సాగునీటి వనరుల అభివృద్ధి,దేవాలయ నిర్మాణ శిల్పకళ, సాంస్కృతిక వారసత్వం, ప్రజా సంక్షేమ దృక్పథం వంటి అంశాలను ట్రైనీ అధికారులకు సమగ్రంగా వివరించారు. కాకతీయులు నిర్మించిన చెరువులు,సాగునీటి వ్యవస్థలు,అద్భుతమైన శిల్పకళా సంపద,దేవాలయ నిర్మాణాలు నేటికీ ప్రజలకు ఉపయోగపడుతున్నాయని.. వారి పరిపాలనా విధానం సమాజాభివృద్ధికి ఆదర్శంగా నిలిచిందని ట్రైనీ అధికారులు అభిప్రాయపడ్డారు. పర్యటన ముగింపు సందర్భంగా హరిత హోటల్‌లో బస చేసిన ట్రైనీ అధికారులకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ తరపున రామప్ప దేవాలయం, భద్రకాళి దేవాలయాల ప్రతిరూపాలతో రూపొందించిన ప్రత్యేక జ్ఞాపికలను అందజేశారు. ఈ పర్యటన విజయవంతం కావడంలో స్థానిక ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి,హనుమకొండ ఆర్ఐ దశరథరాం రెడ్డి,హరిత హోటల్ మేనేజర్ అశోక్ రెడ్డి,హోటల్ సిబ్బంది నరేశ్,కిరణ్,సాయి,రచన,భవాని,సంధ్య, రాజు,రెవెన్యూ సిబ్బంది,ట్రాఫిక్ పోలీసులు,పోలీస్ శాఖ అధికారులు మరియు ఇతర సిబ్బంది విశేష కృషి చేశారు.




# చేనేత కార్మికుల శాంతియుత దీక్ష

వరంగల్ ( వాయిస్ టుడే ) జూన్ 07 : చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వరంగల్‌లో చేపట్టిన శాంతియుత దీక్షకు ఆదివారం పోపా పద్మశాలి ఆఫీసర్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నాయకులు మద్దతు తెలిపారు. దీక్ష శిబిరన్ని సందర్శించిన రాష్ట్ర అధ్యక్షులు శామంతుల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు గుండు కామేశ్వర్ తదితరులు దీక్షలో పాల్గొని, చేనేత ఉత్పత్తుల కొనుగోలులో టెండర్ విధానాన్ని రద్దు చేసి గతంలో మాదిరిగా టెస్కో ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక మంత్రి కొండా సురేఖ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి న్యాయవాదులు మేరుగు సుభాష్, చెన్నూరు రమేష్, అనుమాండ్ల రాజ్ కుమార్, బొమ్మ నాగరాజు, ఎలుగం వెంకట రాములు, సదయ్య, చిన్న భద్రయ్య, అది గొప్పుల సంపత్, దేవులపల్లి సత్యమూర్తి, కూరపాటి సంపత్, పతంగి శ్రీనివాస్, కూచం కూచన లక్ష్మీనారాయణ, గూడూరు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నర్సాపూర్ (వాయిస్ టుడే) : హత్నూర మండల పరిధిలోని చింతల్ చేరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993-1994 విద్యార్థులు బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నాడు ఘనంగా జరుపుకున్నారు.ఈ సమావేశం ఏర్పాటు చేసుకొని ఒకరినొకరు ఆత్మీయ పలకరింపులు చేసుకున్నారు.10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు కొన్ని సంవత్సరాల తర్వాత ఒకే చోట కలుసుకొని ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.చిన్ననాటి జ్ఞాపకాలలో గుర్తు చేసుకుంటూ ఆనాడు చదువు చెప్పిన గురువుల క్రమశిక్షణతో నేడు వివిధ స్థాయిలో స్థిరపడి చిన్ననాటి చిలిపి గుర్తులను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు.అనంతరం భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దామోదర్ రెడ్డి కమ్మరి యాదగిరి సాకలి దశరథ పోచయ్య సుభాష్ గొల్ల నాగేశ సత్యనారాయణ భూపతిరావు భద్రయ్య బీరప్ప రమేష్ ఎండి వలి హైమద్ పాల్గొన్నారు.



# యువ కవి ధారా శ్రీకాంత్‌కు ఘన సన్మానం

ఖమ్మం ,జూన్ 8 (వాయివే టుడే ): శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ సాహితి సేవా సంస్థ, చైతన్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ, రాజమహేంద్రవరంలో తెలుగు భాష, సంస్కృతి, వైభవం, సాహిత్యం, కళలు, తెలుగు సాంప్రదాయాలు వైభవంలో భాగంగా జూన్ 6,7 -2026 జరుగుతున్న 7 వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జెక్కేపల్లి పల్లి గ్రామానికి చెందిన యువ కవి దారా శ్రీకాంత్ కార్యక్రమంలో పాల్గొని కవితా గానం చెయ్యటం జరిగింది. ఈ కార్యక్రమునకు దేశ, విదేశాల నుండి కవులు, కళాకారులు, రాజకీయ ప్రముఖులు, విద్యావేత్తలు పాల్గొని సభలను విజయవంతం చెయ్యటం జరిగింది. కార్యక్రమంలో యువ కవి దారా శ్రీకాంత్ ని ఘనంగా సన్మానించటం జరిగింది.

# రహదారి విస్తరణలో నిర్లక్ష్యం.. చెట్ల కొమ్మలతో ప్రధాన రహదారి అస్తవ్యస్తం

## చెట్లను నరికి చెత్తను మరిచిన కాంట్రాక్టర్

## రోడ్డుపైకి చేరుతున్న కొమ్మలు.. వాహనదారులకు ముప్పు

## డ్రైనేజీలు మూసుకుపోయి దుర్వాసన, దోమల బెడద

## తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్



చిగురుమామిడి, జూన్ 7 (వాయిస్ ఆఫ్ ప్రజలు): మండలంలోని సుందరగిరి గ్రామం నుంచి హుస్నాబాద్ వరకు చేపడుతున్న నాలుగు వరుసల జాతీయ రహదారి విస్తరణ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం బయటపడుతోంది. రహదారి విస్తరణలో భాగంగా గ్రామ పరిధిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను నరికివేసిన కాంట్రాక్టర్, వాటి కొమ్మలు, ఆకులు, చెత్తను అక్కడికక్కడే వదిలేయడంతో గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలోని ప్రధాన రహదారికి అనుకుని ఉన్న ప్రాంతాల్లో నరికివేసిన చెట్ల అవశేషాలు రోజుల తరబడి పేరుకుపోయి ఉండటంతో రహదారి అందవిహీనంగా మారింది. సంబంధిత కాంట్రాక్టర్ పనులు పూర్తయిన అనంతరం చెత్తను తొలగించాల్సి ఉండగా, ఆ బాధ్యతను విస్మరించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరోవైపు సంబంధిత ఆర్ అండ్ బి అధికారుల పర్యవేక్షణ లోపం కూడా ఈ పరిస్థితికి కారణమైందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఇటీవల కురుస్తున్న వర్షాలు, వీస్తున్న ఈదురుగాలుల కారణంగా రోడ్డుపక్కన పడివున్న చెట్ల కొమ్మలు ప్రధాన రహదారిపైకి చేరుతున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా, ప్రమాదాల ముప్పు పొంచి ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ కొమ్మలు స్పష్టంగా కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు.

అంతేకాకుండా, నరికివేసిన చెట్ల చెత్త డ్రైనేజీల్లో చేరి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటోంది. ఫలితంగా మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల వ్యాప్తికి కారణమవుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇది ప్రజారోగ్యానికి కూడా ముప్పుగా మారే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఇళ్ల ముందు, రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని గ్రామస్తులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. రహదారి విస్తరణ పనులు ప్రజల సౌకర్యం కోసం చేపడుతున్నప్పటికీ, నిర్లక్ష్యంతో ప్రజలకే ఇబ్బందులు కలిగించే పరిస్థితి నెలకొనడం బాధాకరమని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు చెట్ల అవశేషాలను తొలగించి రహదారిని పరిశుభ్రంగా మార్చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి సమస్య పరిష్కారం కోసం ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నారు.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక



# పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే.. 18న 'ఛలో హైదరాబాద్'




**రేవంత్ సర్కారు కాలయాపనపై బిల్డర్స్ అసోసియేషన్ ఆగ్రహం**

**ఉమ్మడి జిల్లాలోనే రూ.2 వేల కోట్లకు పైగా బకాయిలు**

**ఆర్థిక ఇబ్బందులతో కాంట్రాక్టర్ల ఆత్మహత్యలు**

**కార్పొరేట్, ఆంధ్రా వారికి చెల్లింపులు సబబు కాదు**

**బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నాయకులు, కాంట్రాక్టర్లు.**

**రెండేళ్లుగా నిలిచిపోయిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్.**

**పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే నిర్మాణ రంగం కుప్పకూలుతుంది**

**ప్రభుత్వం స్పందించని పక్షంలో ఈ నెల 18న 'ఛలో హైదరాబాద్' కార్యక్రమం.**

**బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ వేముల సత్యమూర్తి**

కరీంనగర్ (వాయిస్ టుడే) : ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) వైస్ ప్రెసిడెంట్ వేముల సత్యమూర్తి, రాష్ట్ర మాజీ చైర్మన్లు బి. సుగుణాకర్రావు, కట్కూరి దేవేందర్రెడ్డి, యు. సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదివారం నగరంలోని శ్వేత హోటల్ లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ బిల్లులు చెల్లించకుండా రేవంత్ రెడ్డి సర్కారు కాలయాపన చేస్తోందని, రెండేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రెయినేజీల నుంచి డ్యాముల నిర్మాణం వరకు వివిధ ప్రభుత్వ ఇంజినీరింగ్ శాఖల్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధికి మౌలిక వసతులు కల్పించే కాంట్రాక్టర్లే నేడు అప్పుల ఊబిలో కూరుకుపోవడం గమనార్హం. 40 ఏళ్లలో మొదటి సారిగా ప్రభుత్వానికి సవినయంగానే తమ బాధలు విన్నవిస్తున్నట్లు చెప్పారు. తమ పెండింగ్ బిల్లులను చెల్లించకపోతే జూన్ 18న జరిగే 'చలో హైదరాబాద్' కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

### సీనియారిటీ ప్రకారమే చెల్లింపులు జరపాలి

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్కు అనుగుణంగా ప్రాధాన్యత గల పనులను మాత్రమే కొనసాగించాలని సత్యమూర్తి సూచించారు. ప్రాధాన్యం లేని పనులను నిలిపివేసి, కాంట్రాక్టర్ల డిపాజిట్లను వెనక్కి ఇవ్వాలని కోరారు. 'ముందు వచ్చిన బిల్లుకు ముందు చెల్లింపు' అనే సూత్రాన్ని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం నేతృత్వంలోని ప్రభుత్వ ఉపసంఘానికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని మండిపడ్డారు.

### బకాయిల ఒత్తిడితో ఆత్మహత్యలు

బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం కారణంగా అనేక మంది కాంట్రాక్టర్లు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని సత్యమూర్తి తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడగా, మరికొందరు గుండెపోటుతో మరణించిన ఉదంతాలను ఆయన వివరించారు. కాంట్రాక్ట్ పనులపై ఆధారపడిన వేలాది మంది ఉద్యోగులు, ఇంజినీర్లు, సూపర్వైజర్లు, కార్మికులు, సామగ్రి సరఫరాదారులు కూడా రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం కోసమే ఈ నెల 18న 'ఛలో హైదరాబాద్' నిర్వహిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టర్లు దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### రోడ్డున పడుతున్న లక్షలాది కుటుంబాలు

ఇది కేవలం కాంట్రాక్టర్ల సమస్య మాత్రమే కాదని, దీనిపై ఆధారపడిన లక్షలాది మంది కార్మికుల మనుగడకు సంబంధించిన సమస్య అని నాయకులు స్పష్టం చేశారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వల్ల ఇంజినీర్లు, సూపర్వైజర్లు, అకౌంటెంట్లు, మెషీన్ ఆపరేటర్లు, డ్రైవర్లు మరియు మెటీరియల్ సరఫరాదారులకు వేతనాలు, బకాయిలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఫలితంగా నిర్మాణ రంగంపై ఆధారపడిన వేలాది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఉమ్మడి జిల్లాలోనే రూ.2 వేల కోట్లుకు పైగా..

కార్పొరేట్, ఆంధ్రా రాష్ట్ర కాంట్రాక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి బిల్లులు చెల్లిస్తున్నారని ఆరోపించారు. ఏడాది క్రితం తాము ధర్నా చేసినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఒక్క ఉ మ్మడి వరంగల్ జిల్లాలోనే అన్ని శాఖలకు కలిపి సుమారు రూ.2వేల కోట్ల కు పైగా బిల్లులు పెండింగ్లో ఉన్నాయని వారు వెల్లడించారు. మౌలిక వసతుల కల్పనలో కీలక పాత్ర పోషించే నిర్మాణ రంగాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి, 18న జరగబోయే 'ఛలో హైదరాబాద్' పోరాటానికి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర సలహాదారు కే ప్రభాకర్ రెడ్డి, మాజీ చైర్మన్ ఇమ్మడి దేవేందర్ రెడ్డి, కరీంనగర్ సెంటర్ చైర్మన్ .వి.జితేందర్రావు, హన్మంతరావు, సత్యనారాయణరావు, కమాలుద్దీన్, మాధవరావు, రాష్ట్ర, ఇతర జిల్లాల బీఏఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో ఢిల్లీ వరల్డ్ స్కూల్ నూతన క్యాంపస్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా శ్రీహరి రావు



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) జూన్ 07: నిర్మల్ జిల్లా నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్‌లో, మారుతి ఇన్ వెనుక భాగంలో ఏర్పాటు చేసిన ఢిల్లీ వరల్డ్ స్కూల్ నూతన క్యాంపస్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జ్ లిశ్రీ కూచాడి శ్రీహరి రావులి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణను సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా పాఠశాల యాజమాన్యం కృషి చేయాలని కోరారు.

ఈ సందర్భంగా శ్రీహరి రావు మాట్లాడుతూ, ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్యాసంస్థలు గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు ఉత్తమ అవకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సి.హెచ్. హారిక ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు సారంగాపూర్ ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాది,నిర్మల్ మాజీ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్,తాండ్ర (జి) మాజీ సర్పంచ్ మధుకర్, బిరేవెల్లి మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి, రమేష్ శ్రీకాంత్ పాల్గొన్నారు. ఢిల్లీ వరల్డ్ స్కూల్ నూతన క్యాంపస్ ప్రారంభం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.




## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మహబూబ్నగర్ జిల్లా జూన్ 7 (వాయిస్ టుడే) : జడ్చర్ల/నవాబు పేట్ మండలం పరిధిలో ఉన్న ఎన్మనగండ్ల హైస్కూల్ 2002–2003 బ్యాచికి సంబంధించిన విద్యార్థులు అందరూ కలిసి 23 సంవత్సరాలు తర్వాత ఉపాధ్యాయులని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రుద్రారం రవి, సందీప్ కుమార్ రెడ్డి, విజయ్, శివ శీను, మమత, అనిత, మనెమ్మ, జయమ్మ, కాశ్మీర్ గౌడ్ ,ధర్మరాజు, అంజి, రవి, జమ్మూ కాసిం భాయ్, రఘు, నర్సింలు, కేశవులు, అశోక్, తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.



## జహీరాబాద్ క్రైస్తవ మైనారిటీ కోఆర్డినేటర్ శ్రీమతి అస్మాకు ఘన సన్మానం

### అర్హులైన ప్రతి క్రైస్తవ కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందడమే నా లక్ష్యం: శ్రీమతి అస్మా

ఝరాసంగంజూన్ 07 (వాయిస్ టుడే) : జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ క్రైస్తవ మైనారిటీ కోఆర్డినేటర్‌గా ఇటీవల నియమితులైన శ్రీమతి అస్మా గారిని జీబీ గార్డెన్ మెమోరియల్ మెథడిస్ట్ సెంట్రల్ చర్చి కమిటీ మరియు హోసన్నా మినిస్ట్రీస్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చర్చిలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చర్చి పెద్దలు, కమిటీ సభ్యులు, డబ్ల్యూ.ఎస్.సి.ఎస్ (ఔ.నా.జ.నా) కమిటీ ప్రతినిధులు మరియు సంఘస్తులు శ్రీమతి అస్మాను శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. క్రైస్తవ సమాజ సేవలో ఆమెకున్న నిబద్ధతను చర్చి పెద్దలు కొనియాడారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని క్రైస్తవ మైనారిటీల సంక్షేమం కోసం ఆమె చిత్తశుద్ధితో పనిచేస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ, ఆమె కొత్త బాధ్యతలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

అర్హులందరికీ ప్రభుత్వ సాయం అందిస్తా: సన్మానానంతరం శ్రీమతి అస్మా మాట్లాడుతూ... తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను అత్యంత నిజాయితీతో నిర్వహిస్తానని చెప్పారు. క్రైస్తవ మైనారిటీల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తానని అన్నారు. నియోజకవర్గంలో అర్హత ఉన్న ప్రతి క్రైస్తవ కుటుంబానికి విద్య, స్వయం ఉపాధి, మరియు జీవనోపాధి రంగాలలో ప్రభుత్వ సహాయం లభించేలా చూడటమే తన మొదటి ప్రాధాన్యత అని ఆమె స్పష్టం చేశారు. ఈ బాధ్యతను విజయవంతంగా నెరవేర్చడానికి క్రైస్తవ సమాజం యొక్క ప్రార్థనలు, సహకారం ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. ఈ సన్మాన కార్యక్రమంలో చర్చి పెద్దలు సత్యానందం, నిరంజన్, దేవదాస్, వినయ్ కుమార్, లాజర్, ప్రభాకర్, మోసెస్, తబిత, రోజీ సోలమన్, రజిని రాణి మరియు భక్తులు, సంఘస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి

### జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

ఖమ్మం జూన్-07(వాయిస్ టుడే): ప్రస్తుతం వాతావరణ శాఖ అంచనాల ప్రకారం 2026 వానాకాలంలో ఎల్‌నినో ప్రభావం వల్ల సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లావ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖ, ఉద్యానవన శాఖ, భూగర్భ జల వనరుల శాఖలు సంయుక్తంగా గ్రామాల్లో రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సిద్ధం చేసిందన్నారు. జూలై 15 వరకు వర్షాలు పడకపోతే సాగు చేయవలసిన పంటలు, జూలై 30 వరకు వర్షాలు ఆలస్యమైతే చేపట్టాల్సిన పంటల ప్రణాళిక, అలాగే ఆగస్టు 15 వరకు వర్షపాతం నమోదుకాకపోతే సాగు చేయాల్సిన పంటలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. వర్షాలు ఆలస్యమైన పరిస్థితుల్లో వరి సాగు చేసే రైతులు సంప్రదాయ నాటు విధానానికి బదులుగా వెదజల్లే పద్ధతిని అనుసరించాలని సూచించారు. స్వల్పకాలిక వరి రకాలైన బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048, డబ్ల్యూజీఎల్-44, జేజీఎల్-1978, ఎంటీయూ-1010, జై శ్రీరామ్, హెచ్ఎంటీ సోనా వంటి రకాలను సాగు చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చని తెలిపారు.

వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటల సాగు విస్తీర్ణం తగ్గిన పక్షంలో వాటి స్థానంలో పెసర, మినుము, బొబ్బర, కంది, వేరుశనగ వంటి పంటలను సాగు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. రైతులకు అవసరమైన పెసర విత్తనాలను ఆత్మనిర్భరత మిషన్ పథకం క్రింద రాయితీపై అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామసభల ద్వారా రైతులకు విస్తృత అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం పత్తి సాగు చేసే రైతులు తొందరపడి విత్తనాలు వేయవద్దని, భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడే విత్తనాలు వేయాలని సూచించారు. కనీసం 60 నుంచి 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతే పత్తివిత్తనాలు వేయడం మంచిదని, జూలై 15 వరకు పత్తి సాగుకు అనుకూల సమయం ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.




## చిట్యాల్ గ్రామంలో ఇషా పారాలసిస్ సెంటర్ ప్రారంభం



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) జూన్07 : నిర్మల్ జిల్లా నిర్మల్ మండలంలోని చిట్యాల్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇషా పారాలసిస్ సెంటర్ ను ఈ రోజు నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారాలసిస్ బాధితులకు నాణ్యమైన వైద్య సేవలు, ఫిజియోథెరపీ మరియు పునరావాస సేవలు అందించేందుకు ఈ సెంటర్ ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులోనే మెరుగైన చికిత్సా సౌకర్యాలు లభించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం సెంటర్‌లోని సౌకర్యాలను పరిశీలించి, నిర్వాహకులను అభినందించారు. రోగులకు అంకితభావంతో సేవలు అందించి, వారి ఆరోగ్య పునరుద్ధరణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కత్తి నరేందర్, గోపు గోపి,శనిగరాపు నరేష్, రాఘవేంద్ర చారి, లక్కాకుల హరీష్, మాజీ కౌన్సిలర్ ధర్మాజీ శ్రీనివాస్, నాయకులు ఆడప శ్రీకాంత్,స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పాల్గొన్నారు.



## ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం: జీకే కృష్ణ మాస్టర్

మహబూబ్‌నగర్ జిల్లా జూన్ 7 (వాయిస్ టుడే): పాలమూరు/ ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవడం ఎంతో అవసరమని జీకే కరాటే ఫౌండర్ కరాటే మాస్టర్ జీకే. కృష్ణ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో న్యూ షాటోకాన్ కరాటే-డూ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ గ్రేడ్ ఇన్ టెస్ట్ కరాటే పోటీలు ఘనంగా జరిగాయి.

ఈ పోటీలలో ధర్మాపూర్, చౌదర్‌పల్లి, బొక్కలోనిపల్లి, జైనల్లిపూర్, జమీస్తాపూర్ తదితర 6 గ్రామాలకు చెందిన విద్యార్థులు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి జీకే కరాటే ఫౌండర్ కృష్ణ మాస్టర్ ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే కేవలం ఆత్మరక్షణ విద్య మాత్రమే కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం మరియు మానసిక ఏకాగ్రతను పెంపొందించే ఉత్తమ కళ అని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.

అనంతరం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ ఫౌండర్, కరాటే మాస్టర్ జీకే కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని నాగరాజుగౌడ్, శ్రీనివాస్, అర్చన, శ్రీధర్‌లకు బ్లాక్ బెల్ట్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ బెల్ట్ పొందిన వారిని సభికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, క్రీడాకారులు, యువకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు కరాటే శిక్షకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఖమ్మం జిల్లాలో 114 ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీ

**ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టులకు జూన్ 8, 9 తేదీల్లో దరఖాస్తుల స్వీకరణ**

వైరా ప్రతినిధి (వాయిస్ టుడే) : ఖమ్మం జిల్లాలో 2026–27 విద్యా సంవత్సరానికి మంజూరైన 114 ప్రీ–ప్రైమరీ పాఠశాలల్లో ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి జిల్లా విద్యాశాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) కార్యాలయం శనివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో ఉన్న పాఠశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన ఈ నియామకాలు చేపట్టనుండగా, అర్హులైన అభ్యర్థులు జూన్ 8, 9 తేదీల్లో సంబంధిత మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచించారు. విద్యాశాఖ ప్రకటన ప్రకారం, ప్రతి ప్రీ–ప్రైమరీ పాఠశాలలో ఒక ఇన్స్ట్రక్టర్, ఒక ఆయా పోస్టును భర్తీ చేయనున్నారు. మొత్తం 114 ఇన్స్ట్రక్టర్ పోస్టులు, 114 ఆయా పోస్టులు కలిపి 228 ఖాళీలను భర్తీ చేసే ప్రక్రియ చేపట్టనున్నారు. ఇన్స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ లేదా సమాన అర్హత ఉండాలి. ఆయా పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణతను కనీస అర్హతగా నిర్ణయించారు. అలాగే ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్ (ఇఇఇ), ప్రైమరీ టీచింగ్‌కు సంబంధించిన విద్యార్హతలు, శిక్షణ కలిగిన అభ్యర్థులకు ఎంపికలో ప్రాధాన్యత కల్పించనున్నారు. స్థానిక అభ్యర్థులకు అవకాశాలు పెంచే ఉద్దేశంతో గ్రామ పంచాయతీ, మండల పరిధికి చెందిన వారికే ముందుగా ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ఎంపికైన ఇన్స్ట్రక్టర్లకు నెలకు రూ.8,000 గౌరవ వేతనం, ఆయాలకు నెలకు రూ.6,000 గౌరవ వేతనం చెల్లించనున్నారు. అయితే ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన మాత్రమే ఉంటాయని, శాశ్వత ఉద్యోగాలుగా పరిగణించరాదని విద్యాశాఖ స్పష్టం చేసింది. అర్హతలు కలిగిన అభ్యర్థులు నిర్దేశిత తేదీల్లో సంబంధిత ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలి. ఎంపిక ప్రక్రియలో స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుంది అని జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ నియామకాల ద్వారా జిల్లాలో ప్రీ–ప్రైమరీ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.



# కవి వెంకట్‌కు ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల పురస్కారం

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 07: నిర్మల్‌కు చెందిన ప్రముఖపద్యకవి, వ్యాఖ్యాత,సంస్కృతభాషా ప్రచార సమితి ఆదిలాబాదు నిజామాబాదు ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షులు డా. బి వెంకట్ ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరములో ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల పురస్కారమును స్వీకరించారు. రాజమహేంద్రవరములోని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయములో చైతన్య సారస్వత పరిషత్,శ్రీ శ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో 6,7 వ తేదులలో జరిగిన లి7 వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ డా కత్తిమండ ప్రతాప్ కుమార్, జాతీయ అధ్యక్షురాలు జి ఈశ్వరీభూషణం, జాతీయ ప్రణాళిక అధికారి డా టి పార్థసారథి, గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ శ్రీ కె వి వి సత్యనారాయణరాజు ల చేతులమీదుగా ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల పురస్కారమును ప్రముఖపద్యకవి డా బి.వెంకట్ అందుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ రక్షణదళం కమాండెంట్ కొండా నరసింహ్మారావు,పూర్వం ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు,సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా ఎం శ్రీనివాస్ రావు, ప్రముఖ విశ్లేషకులు యర్రాప్రగడ రామకృష్ణ కృష్ణ, శ్రీనాథ కవిసార్వభౌముడు ఇ 13 వ తరం వారసుడు కావూరి శ్రీనివాస్ శర్మ, కాసుల పురుషోత్తమకవి 5 వ తరౌ వారసుడు కాసుల కృష్ణంరాజు, కంచర్ల గోపన్న 10 వ తరం వారసుడు కంచర్ల శ్రీనివాసరావు, కవయిత్రి మొల్ల 14 వ తరం వారసుడు డా ఎన్ శివశంకర్ లు పా ల్గొన్న ఈ సభల్లో వెంకట్ కవిసమ్మేళనము , సాహిత్య సభలకు విశిష్ఠ అతిథిగా,సమన్వయకర్తగా పాల్గొన్నారు. తెలుగుభాషా వైభవంపై పద్యపఠనగానం చేశారు.ఇందుకు గుర్తింపుగా ఆయన ఈ పురస్కారమును అందుకున్నారు.సాంస్కృతిక ప్రదర్శనలు,నాటకాలు,గేయాలు, నృత్యాలు వంటి కార్యక్రమాలకు ప్రతినిధులుగా పాల్గొన్నారు.




# మూడేళ్ల తర్వాత ప్రారంభం కానున్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల

**ఈ విద్యా సంవత్సరం (2026–27) నుంచే క్లాసులు**

**– తెలుగు,ఇంగ్లీష్ మీడియాల్లో విద్యాబోధన**

**– సోమవారం నుంచి బడిబాట కార్యక్రమం**

నాగార్జున సాగర్,జూన్ 7 వాయిస్ టుడే : నాగార్జున సాగర్ హిల్ కాలనీలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల తిరిగి ప్రారంభం ప్రారంభించనున్నట్లు బాలికల ఉన్నత పాఠశాల హెచ్.ఎం ధనమ్మ,ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు,ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్,జిల్లా విద్యాశాఖాధికారి మండల విద్యాధికారిల ఉత్తర్వుల ప్రకారం,నాగార్జునసాగర్ హిల్ కాలనీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శేషు,పాఠశాల హెచ్ఎం ధనమ్మ, సందర్శించారు,ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గత మూడు సంవత్సరాలుగా మూతబడిన ఈ పాఠశాలను,ప్రస్తుత విద్యా సంవత్సరం 2026–27 నుండి పున ప్రారంభించను న్నట్లు తెలిపారు, విద్యార్థినులకు అనుకూలంగా తెలుగు మరియు ఇంగ్లీష్ మీడియంలలో నాణ్యమైన విద్యాబోధన అందించడా నికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు,ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం నుండి పాఠశాల ఉపాధ్యాయులు హిల్ కాలనీ పరిసర ప్రాంతాల్లోని ఇంటింటికీ రానున్నారు. పాఠశాల పునప్రారంభం వివరాలను తల్లిదండ్రులకు, వివరించి, అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

# ఎస్ పి బాలసుబ్రమణ్యం జయంతి వేడుకల్లో దండు నాగేశ్వరరావు మధుర గానామృతం

**మాచర్లలో ఘనంగా పాటల కార్యక్రమం అమరగీతాలతో ప్రేక్షకులను అలరించిన కళాకారులు**

**ఎస్ పిజయంతి సందర్భంగా నిర్వహించిన సంగీత కార్యక్రమంలో దండు నాగేశ్వరరావు గానం**



నాగార్జునసాగర్ ,జూన్ 7: (వాయిస్ టుడే): గానగంధర్వుడు, ప్రముఖ నేపథ్య గాయకుడు డా. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని మాచర్ల పట్టణంలో నిర్వహించిన సంగీత కార్యక్రమం ఘన విజయాన్ని సాధించింది. నాగార్జునసాగర్‌కు చెందిన శ్రీ విఘ్నేశ్వర కళాపరిషత్ వ్యవస్థాపకులు దండు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం సంగీతాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. ఎస్పీబీ ఆలపించిన చిరస్మరణీయ గీతాలతో సభా ప్రాంగణం సంగీతమయంగా మారగా, ప్రేక్షకులు మైమరచిపోయి కార్యక్రమాన్ని ఆస్వాదించారు.

కార్యక్రమంలో పాల్గొన్న పలువురు గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన ఎన్నో మధుర గీతాలను ఆలపించి ఆయనకు సంగీత నివాళి అర్పించారు. ముఖ్యంగా దండు నాగేశ్వరరావు స్వయంగా వేదికపై మైక్ అందుకుని ఎస్పీబీ పాటలను ఆలపించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయన గాన ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ప్రతి పాట ముగిసిన అనంతరం సభికులు కరతాళ ధ్వనులతో తమ అభినందనలు తెలియజేశారు.

సంగీతాభిమానులతో నిండిన సభలో ఎస్పీబీ పాటలు వినిపించగానే పలువురు అభిమానులు గానగంధర్వుడి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. దశాబ్దాలుగా తెలుగు ప్రజల హృదయాల్లో నిలిచిన ఎస్పీబీ గాత్రమాధుర్యం గురించి చర్చించుకుంటూ కార్యక్రమాన్ని ఆస్వాదించారు. సంగీతం పట్ల ఆయనకు ఉన్న అంకితభావం, వేలాది పాటల ద్వారా తెలుగు సంగీత ప్రపంచానికి అందించిన సేవలను పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా దండు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలుగు సినీ సంగీత రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన గాత్రం, వ్యక్తిత్వం, సంగీత వారసత్వం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఎస్పీబీ పాటలు కేవలం వినోదం మాత్రమే కాకుండా భావోద్వేగాలకు ప్రతిరూపంగా నిలిచాయని, ఆయన జయంతి వేడుకలను ప్రతి ఏడాది నిర్వహించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు.

ఉత్సాహభరితంగా సాగిన ఈ సంగీత విభావరి మాచర్ల, నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల సంగీతాభిమానులకు మధురానుభూతిని మిగిల్చింది. ఎస్పీబీ అమరగీతాలు మరోసారి ప్రేక్షకుల హృదయాలను తాకగా, గానగంధర్వుడికి ఘన సంగీత నివాళిగా ఈ కార్యక్రమం నిలిచింది.



# పాకాలను సన్మానించిన మాజీ మంత్రి వర్యులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 07: నిర్మల్ జిల్లా తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రామచందర్ ను నియమితులైనందుకు సంతోషిస్తూ మాజీ మంత్రివర్యులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి నిర్మల్ లోని వారి క్యాంప్ ఆఫీస్ నందు ఆదివారం రోజున శాలువాతో సత్కరించి పూల మొక్కల అందించి అభినందనలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో పివి రమణారెడ్డి పిఎసిఎస్ చైర్మన్, మల్లేష్ డిసిసి ప్రధాన కార్యదర్శి, అనుముల భాస్కర్ బీసీ సంఘాల అధ్యక్షుడు,మేకల రాజేందర్ యాదవ్ మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్‌వీఆర్ ఇంటర్నేషనల్ మాన్‌పవర్ కన్సల్టెన్సీ ప్రారంభించిన మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్07: నిర్మల్ పట్టణంలో ఈ రోజు నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌వీఆర్ ఇంటర్నేషనల్ మాన్‌పవర్ కన్సల్టెన్సీ కార్యాలయాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతకు దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఇటువంటి మాన్‌పవర్ కన్సల్టెన్సీలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. నిరుద్యోగ యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకుని మంచి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం కన్సల్టెన్సీ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, సంస్థ విజయవంతంగా ముందుకు సాగి మరెందరికో ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కత్తి నరేందర్, గోపు గోపి, శనిగరాపు నరేష్, లక్కాకుల హరీష్, పెండం శ్రీనివాస్, గుంజాల చైతన్య, రాఘవేంద్ర చారి, టౌన్ ప్రెసిడెంట్ నాందేడపు చిన్ను తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలోనాణ్యమైన పోషక ఆహారం అందించాలి

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్07: నిర్మల్ జిల్లా అంగన్వాడీలలో నాణ్యమైన పోషకాహారం అందించాలని జిల్లా ఆహార పద్ధతి అధికారి సునీత సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా నిర్మల్ కలెక్టరేట్లో ఆదివారం అంగన్వాడీ ఉపాధ్యాయులకు ఆహార భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో చిన్న పిల్లలు గర్భిణులు బాలింతలు ఆరోగ్య సంరక్షణలో అంగన్వాడీ కేంద్రాలు పాత్ర అత్యత్య కీలకమైందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఆహార భద్రత అధికారి సునీత మరియు వారితో పాటు వివిధ అధికారులు పాల్గొన్నారు.

# ఎంపీ నిధులతో నూతన బోరు ప్రారంభం

**కృతజ్ఞతలు తెలిపిన కమాల్‌పల్లి గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు**

ఝరాసంగం (జూన్ 07) వాయిస్ టుడే : ఝరాసంగం మండలంలోని కమాల్‌పల్లి గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారానికి ముందడుగు పడింది. గ్రామంలోని శ్రీ బేతాళ స్వామి ఆలయ ఆవరణలో స్థానిక భక్తులు, గ్రామస్తుల తాగునీటి అవసరాల నిమిత్తం సంగారెడ్డి ఎంపీ సురేష్ శెట్కర్ నిధులతో మంజూరైన నూతన బోరుబావిని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సంపూర్ణ సంగ్రామ్ పాటిల్, మాజీ ఎంపీటీసీ మారుతి రావు పాటిల్, మాజీ ఉప సర్పంచ్ మోహన్, వార్డు సభ్యులు రాజారాం రావు, బండారి మల్లేష్ తదితరులు పాల్గొని బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామస్తుల, భక్తుల ఇబ్బందులను గుర్తించి మంచినీటి సౌకర్యం కోసం నిధులు కేటాయించిన ఎంపీ సురేష్ శెట్కర్ గారికి కమాల్‌పల్లి గ్రామ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, యువకులు దన్నారం, సంజీవులు బొడ్డు, శంకర్ అలిగే, రాజు (రిపోర్టర్ బొడ్డు), నాగేష్ అలిగే, మచ్చేందర్, ముక్తార్, ఖాజా, భీమన్న, జనార్ధన్ రెడ్డి, మోహన్ రెడ్డి, రాములు, నరసింహులు, షాబుద్దీన్, బత్తినీ కిష్టన్న, గొర్లకాడి సంగమేష్, బండారి వసంత్, రాసన్న, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తెలుగువారి గుండె చప్పుడు SP బాలసుబ్రహ్మణ్యం

**– ఆయన పాటలు సజీవంగా ఉంచుదాం**

**: డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్నలి**



పాల్వంచ మండలం జూన్ 7 (వాయిస్ టుడే ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల కేంద్రంలో నిర్వహించిన స్వర్గీయ గాన గంధర్వుడు, పద్మవిభూషణ్ డా. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి తోట దేవి ప్రసన్న ,జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ చీకటి కార్తీక్ ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న మాట్లాడుతూ, “40 వేలకు పైగా పాటలు పాడి తెలుగు జాతిని అలరించిన మహనీయుడు శ్రీ బాలు. ఆయన గొంతులో తెలుగు భాష పలికిన తీరు, ఉచ్చారణ ప్రపంచానికి ఆదర్శం. కులం, మతం, ప్రాంతం అనే తేడా లేకుండా అందరి గుండెల్లో నిలిచిపోయిన అజరామరుడు. అలాంటి మహానుభావుడి జయంతి జరపడం మనందరి బాధ్యత” అని అన్నారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్ మాట్లాడుతూ, “నేటి యువతకు శ్రీ బాలు గారే స్ఫూర్తి. ఎలాంటి బ్యాగ్రౌండ్ లేకుండా కేవలం టాలెంట్‌తో ప్రపంచ స్థాయికి ఎదిగారు. ఆయన పాటలు వింటూ పెరిగిన తరం మనది. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా బాలు జయంతి నిర్వహించి కొత్త కళాకారులను ప్రోత్సహిస్తాం” అని హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షులు తోట దేవి ప్రసన్న,యూత్ జిల్లా అధ్యక్షులుచీకటి కార్తీక్,యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, స్థానిక కళాకారులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నిర్మల్ చేపల మార్కెట్ కు పోటెత్తిన జనం

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 07: నిర్మల్ జిల్లా నిర్మల్ పట్టణంలో మృగశిర కార్తికను పరిష్కరించుకొని మిమ్మల్ని పట్టణం బోయవాడ కాలనీలోని చేపల మార్కెట్ కు ఆదివారం ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. ఏటా జూన్ మాసంలో వచ్చే మృగశిర కార్తె రోజున చేపలు తినడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది. ఈరోజున చేపలు ముగించడం వల్ల ఆయురారోగ్యాలు కలుగుతాయని నమ్మకంతో వెనుకదారులు పెద్ద సంఖ్యలో కొనుగోలు చేయడంతో మార్కెట్ అంతా సందడిగా మారింది.

# పంట పొలాలలో మంటలు పెట్టకండి

**వరంగల్ ఈస్ట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బెడద వీరన్న.**



వరంగల్ ( వాయిస్ టుడే ) జూన్ 07 : వ్యవసాయం పై ఎంతో అవగాహన ఉన్న రైతన్నలు ఈ మధ్యకాలంలో పంట సాగు చేయడానికి గతం లో పండించిన పంటకు సంబందించిన పంట భూముల్లో మొదళ్ళకు మంటలు పెట్టి బుసరాన్ని దెబ్బ తీస్తూ అలాగే వాతావరణ కాలుష్యానికి పాటు పడటం భాధ కారమని వరంగల్ ఈస్ట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విడుద వీరన్న అన్నారు. రైతులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని దయచేసి రైతులు ఎవరు పంట భూములకు నిప్పు పెట్టవద్దని ఆయన రైతు సోదరులను కోరారు. ఈ విషయాన్ని గమనించి పంట భూములలో మంటలు పెట్టే సంస్కృతికి స్వస్తి చెప్పాలని రైతన్నలను ఈ సందర్భంగా అయన వేడుకుంటున్నారు. ఈ కార్యక్రమము లో ఖిలా వరంగల్ మండల్ కిసాన్ సెల్ అధ్యక్షులు ఎసిరెడ్డి ప్రభాకర్ స్థానిక కాంగ్రెస్ నాయకులు బోల్లుగోడు రఘు, సుంచు వీరన్న, నలివేల ఐలయ్య,బిల్లా అమర్, బిల్లా రమేష్, బొలుగుడ్డు కోటి,రిటైర్డ్ టీచర్ రైతు సత్యం, కలకుట్ల కుమార్, కందిమల్ల భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**